క్లుప్తంగా

కొత్త పింఛన్లు పంపిణీ

ములకలచెరువు : అర్హులకు మంజూరైన పింఛన్లను గురువారం ములకలచెరువు సచివాలయం వద్ద ఎంపీడీఓ అశ్విని, సర్పంచ్ రహమత్‌బీ, ఎంపీటీసీ ఆయిషా పంపిణీ చేశారు. మండలం మొత్తం సుమారు 500 వరకు కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దిన్నేపాటి రవీంద్రారెడ్డి, నాయకులు చాంద్‌బాషా, రెడ్డి మౌలాలి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమండ్యం : మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో అర్హులైన వితంతు, వృద్ధాప్య, వికలాంగులకు కొత్తగా వచ్చిన పింఛన్లు పంపిణీ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ జి.పూర్ణచంద్రిక అధ్యక్షతన గురువారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎంపీడీఓ శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

నేడు కేవీపల్లెలో 'జగనన్నకు చెబుదాం'

కేవీపల్లె : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి తెలిపారు. కలెక్టర్ గిరీషా పీఎస్, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరవుతారని తెలిపారు.

ఐటీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా వెంకట శివ

బి.కొత్తకోట : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఐటీ విభాగం కమిటీలో బి.కొత్తకోట మండలం మొరవపల్లికి చెందిన వెంకటశివను రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించారు. తన నియామకానికి కృషి చేసిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డికి కతజ్ఞతలు తెలిపారు.

తల్లీ, బిడ్డల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పెద్దతిప్పసముద్రం : తల్లీ, బిడ్డల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ మహమూద్, వైస్ ఎంపీపీ శోభా, శంకర్, సర్పంచ్ రహంతుల్లా, ఎంపీటీసీ కేశవ్ అన్నారు. గురువారం మండలంలోని కందుకూరు పంచాయతీలోని గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పోషక మాసోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్నమ్మ పాల్గొన్నారు.

వలంటీర్ జ్ఞాపకార్థం టోర్నమెంట్

పెద్దతిప్పసముద్రం : మండలంలోని టి.సదుంకు చెందిన వలంటీర్ జయచంద్ర జ్ఞాపకార్థం పంచాయతీలోని వైఎస్సార్‌సీపీ నాయకులు క్రికెట్ టోర్నమెంటు నిర్వహిస్తున్నారు. ఈ నెల 17 నుంచి 18 వరకు క్రికెట్ టోర్నీ జరుగుతుందన్నారు. వివరాలకు 9740658184 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఉత్తమ హెచ్‌ఎంకు సత్కారం

బి.కొత్తకోట : క్రమ శిక్షణతో కష్టపడిన వారికి ఎప్పుడూ తగిన గౌరవం, గుర్తింపు లభిస్తుందని మదనపల్లి ఉప విద్యాశాఖాధికారి క్రిష్ణప్ప అన్నారు. గురువారం గోళ్లపల్లి ఉన్నత పాఠశాలలో జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా ఎంపికైన కాంతారామ్‌ను సన్మానించారు. ఎంఈఓ రెడ్డిశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు అమరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ టెక్‌తో మిట్స్ ఒప్పందం

కురబలకోట: చెన్నైలోని ఇన్‌స్పైర్ టెక్ కంపెనీతో మదనపల్లె దగ్గరున్న మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు అవగాహన ఒప్పందం కుదిరినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, ప్రాజెక్టులు, ప్లేస్‌మెంట్ అవకాశాల కల్పన తదితర డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్‌కు ఈ ఒప్పందం ఉపకరిస్తుందన్నారు.

ఆర్థిక ప్రగతికి చేయూత

తంబళ్లపల్లె: మహిళా సంఘాల సభ్యుల ఆర్థిక ప్రగతికోసమే ప్రభుత్వం పలు పథకాలు అమలుచేస్తోందని శ్రీనిధి మేనేజర్ అమరావతి తెలిపారు. గురువారం స్త్రీ శక్తి భవనంలో వీవో సభ్యులు, సంఘమిత్రలకు జరిగిన వర్క్‌షాపులో ఆమె మాట్లాడారు. ఏపీయం గంగాధర్, సీసీలుతులసీ, ఆదిలక్ష్మీ, హంసీరాబేగం, భద్ర, భవానిశంకర్, డీఎంజీ మల్లయ్య పాల్గొన్నారు.

'సురక్ష' పేదలకు రక్ష

తంబళ్లపల్లె : గ్రామీణ ప్రజలకు ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ఓ రక్షగా నిలుస్తుందని జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ స్కందప్ప తెలిపారు. గురువారం బాలిరెడ్డిగారిపల్లె సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీడీఓ సురేంద్రనాథ్, డాక్టర్ మునికుమార్, పంచాయతీ కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

కేవీపల్లె : అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం గ్యారంపల్లె సెక్టార్ పరిధిలోని తువ్వపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారం పై అవగాహన కల్పించారు.

సాగు చేసిన ప్రతి పంటను ఈక్రాప్ చేయాలి

గుర్రంకొండ : గ్రామాల్లో రైతులు సాగు చేసుకొన్న ప్రతి పంటను తప్పనిసరిగా ఈక్రాప్ నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రా నాయక్ అన్నారు. గురువారం మండలంలోని సరిమడుగు గ్రామంలో ఆర్బీకే సిబ్బంది గత కొన్ని రోజులుగా చేస్తున్న ఈ క్రాప్ నమోదును ఆకస్మికంగా తనిఖీ చేశారు.

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ లబ్ధి

పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



కలికిరి : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి : అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ లబ్ధి చేకూరుస్తున్న ఘనత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికే దక్కిందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని మెయిన్ స్కూల్ ఆవరణలో గురువారం సాయంత్రం లబ్ధిదారులకు నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాలలో సంక్షేమ పథకాలలో లబ్ధిదారులను ఏ విధంగా తగ్గించాలని చూసేవారని, అందుకు భిన్నంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హత కలిగిన వారికి ఏ విధంగా లబ్ధి చేకూర్చాలని ఆలోచిస్తోందన్నారు. సంక్షేమ పథకాలను ఇంటింటికి అందజేస్తున్న వలంటీర్ల సేవలు మరువలేనివని కొనియాడారు. అనంతరం మండల పరిధిలో ముగ్గురు దివ్యాంగులకు మంజూరైన ట్రైసైకిళ్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా వారికి అందజేశారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మెన్ తిమ్మారెడ్డి, ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, ఎంపీడీఓ గంగయ్య, డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్, సర్పంచ్‌లు వెంకటరెడ్డి, నాగవేణి, గంగయ్య, అరుణకుమారి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆఘామొహిద్దీన్, మండల పార్టీ కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్టీడీ హరి, మండల కో-ఆప్షన్ సభ్యుడు రిజ్వానుల్లా, సచివాలయాల మండల కన్వీనర్ రెడ్డెప్ప, ఎంపీటీసీ సభ్యులు అల్లాబక్షు, షాహీనా, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవ్వాతాతల కళ్లలో ఆనందం నింపడమే జగనన్న లక్ష్యం

పీలేరు : అవ్వాతాతల కళ్లలో ఆనందం నింపడమే జగనన్న లక్ష్యమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలానికి కొత్తగా 496 పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ పింఛన్లకు దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. అనంతరం 80 శాతం రాయితీతో ఉలవలు పంపిణీ చేశారు. అలాగే మండలంలోని మేళ్లచెరువుకు చెందిన అంకెం విజయలక్ష్మీ ప్రమాదంలో మృతి చెందగా ఆమె కుమార్తెకు వైఎస్సార్ బీమా రూ. 5 లక్షలు చెక్కు అందజేశారు. చేపల వ్యాపారస్తులకు 40 శాతం రాయితీలో ఫ్రీజర్ బాక్సులు పంపిణీ చేశారు. జిల్లాలో పింఛన్ల పంపిణీలో మొదటిస్థానం సాధించినందుకు ఎంపీడీఓ మురళీమోహన్‌రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, సర్పంచ్‌లు డాక్టర్ హబీబ్‌బాషా, జగన్ మోహన్‌రెడ్డి, హరిణి, నాయకులు హుమయూన్, మహితా ఆనంద్, నాగరాజమ్మ, ఎస్.వి. చలపతి, స్టాంపుల మస్తాన్, రెడ్డిబాషా, తహసీల్దార్ ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

హృదయాలను కలిపే భాష హిందీ

మదనపల్లె సిటీ : హృదయాలను కలిపే భాష హిందీ అని ప్రముఖ హిందీ ఉర్దూ భాషా కవి ఖమర్ అమీని అన్నారు. గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హిందీ ప్రపంచంలోనే అత్యధికంగా మాట్లాడే మూడవ అతి పెద్ద భాష అన్నారు. హెడ్‌మాస్టర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ హిందీభాష మాధుర్యాన్ని వివరించారు. హిందీ భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం హిందీభాషలో నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కవి ఖమర్ అమీనీని సత్కరించారు. కార్యక్రమంలో హిందీ విభాగాధిపతి వసుధ, రూటా రాష్ట్ర నాయకులు మహమ్మద్‌ఖాన్, సుధాకర్‌నాయుడు, ఆర్.వి. రమణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న కవి ఖమర్ అమీని

ఘనంగా జాతీయ హిందీ దినోత్సవం

రామసముద్రం : రామసముద్రం జెడ్పీ ఉన్నత పాఠశాల , మోడల్‌స్కూల్‌లో గురువారం జాతీయ హిందీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం ఎం.చిట్టిబాబు , ప్రిన్సిపాల్ మునిస్వామినాయక్ ఆధ్వర్యంలో పిల్లలకు పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. రామసముద్రం హైస్కూల్‌లో హిందీ ఉపాధ్యాయులు ఆయేషా, జయలక్ష్మీలు మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేయడంతో పాటు విందు భోజనం ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు పోటీలు

బి.కొత్తకోట : స్థానిక ఆదర్శ పాఠశాలలో గురువారం హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు వక్తృత్వ, వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరచిన వారికి ఎంఈఓ రెడ్డి శేఖర్ బహుమతులను ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ శీను నాయక్, జహీర్ ఖాన్, నాగసాయి లీల, నూర్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సమీకృత నిర్వహణ సాగు పద్ధతి ఆదర్శనీయం

పీలేరురూరల్ : సమీకృత నిర్వహణ సాగు పద్ధతి ఆదర్శనీయమని రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. కుమ్మరిపల్లె వద్ద సమీకృత సాగు నిర్వహణ పద్ధతిలో సాగుచేసిన వంగతోటతో పాటు పీలేరు ఆయిల్‌సీడ్స్ వద్ద చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు బోదేషావలి, ఏడీఏ రమణరావు, ఏఓలు రమాదేవి, కరుణాకర్, ఏఈఓ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

రమణారెడ్డి మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటు

కలకడ : మండలంలోని నడిమిచెర్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రమణారెడ్డి(76) మృతి పార్టీకి తీరని లోటని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. రమణారెడ్డి మృతదేహం వద్ద గురువారం ఎమ్మెల్యే నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ శ్రీదేవి, మాజీ ఎంపీపీ మధుసూదన్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చెర్మన్ బరకం రవి కుమార్‌రెడ్డి, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

చంద్రబాబు మహాత్ముడేమీ కాదు

వాల్మీకిపురం : ప్రజా ధనాన్ని స్వాహా చేసిన కేసులో అరెస్టు అయిన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు మహాత్ముడేమీ కాదని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు ఒక మహాత్ముడిని అకారణంగా అరెస్టు చేసినట్లు ప్రజల్ని ఏమార్చేందుకు చేస్తున్న గోబెల్స్ ప్రచారాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. గతంలో వ్యవస్థలను అడ్డుపెట్టుకొని అవినీతి కేసుల నుంచి తప్పించుకుంటూ వచ్చిన చంద్రబాబుకు కష్టకాలం మొదలైందన్నారు. ఇంకా పలు అవినీతి కేసులను ఆయన ఎదుర్కోక తప్పదన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవి, మాజీ సర్పంచ్‌లు సురేష్ కుమార్ రెడ్డి, చంద్రశేఖర్, నాయకులు రవీంద్రారెడ్డి, ఆనంద్, సుధాకర్, సత్య తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం

పెద్దతిప్పసముద్రం : సచివాలయ వ్యవస్థతో సీఎం జగనన్న గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించి గాంధీజీ కలలను సాకారం చేశారని ప్రజా ప్రతినిథులు, నాయకులు మహమూద్, సుబ్బరాం, శివన్న, డ్రిప్ రమణ అన్నారు. గురువారం మండలంలోని కందుకూరు పంచాయతీలో మండల స్థాయి అధికారులతో కలసి పల్లెబాట కార్యక్రమం చేపట్టారు. ప్రతి గడపకూ వెళ్లి జగనన్న పాలనలో మంజూరు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. స్థానిక సర్పంచ్ రహంతుల్లా, వైస్ ఎంపీపీ పట్టెరిక శోభా, శంకర్, ఎంపీటీసీ కేశవ్, స్థానిక నాయకులు మొండికోళ్ల రామచంద్ర, ఉప సర్పంచ్ శంకర్, రవి, బషీర్, మస్తాన్, రమేష్, ప్రసాద్, మమ్మీ, హిద్దీ, గణేష్,హరి, శేఖర్, సంజీవ్,శివారెడ్డితో పాటు అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పల్లెబాట కార్యక్రమంలో నాయకులు

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

కేవీపల్లె : ఈ నెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జరిగే ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) నియోజకవర్గ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ మండల కన్వీనర్ దొడ్డి వెంకటాచలపతి, ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి వగ్గ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ నాయకుల రిలే దీక్ష

పెద్దతిప్పసముద్రం : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎంఆర్‌పీఎస్ నాయకులు రిలే దీక్ష చేపట్టారు. మండల ఇన్‌చార్జి మబ్బు చంద్ర ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలో మల్లెల రవి మాట్లాడుతూ ఈ నెల 18నుంచి 22 వరకు జరిగే పార్లమెంటు సమావేశాల్లో చట్టబద్ధత కల్పించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలు ప్రారంభం

పీలేరురూరల్ : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలు ప్రారంభించారు. ముఖ్య అతిథిలుగా హాజరైన జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, కోటపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శివశంకరయ్య, ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల అధ్యక్షుడు రమేష్ బాబు ఆటల పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు సంపూర్ణమ్మ, ఉషారాణి, సహదేవనాయక్, నరేంద్రరెడ్డి, జ్యోత్స్న, రియాజ్, ఆర్ముగం, రాణి, పోసేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట నిలుపుకుంటున్న ముఖ్యమంత్రి

రామసముద్రం : ఎన్నికల ముందు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్లు మంజూరు చేస్తున్నారని ఎంపీపీ కుసుమకుమారి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కృష్ణారెడ్డి , వైస్ ఎంపీపీ రమణారెడ్డి , కన్వీనర్ భాస్కర్‌గౌడ్ తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రభుత్వం మంజూరు చేసిన నూతన పెన్షన్లను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, ఉపసర్పంచ్ మస్తాన్, నాయకులు సుబ్బారెడ్డి, గెవన్న, శివ, కృష్ణప్ప, నారాయణస్వామి, అధికారులు పాల్గొన్నారు.

లింగోద్భవ మహాశివుడికి అమావాస్య అన్నాభిషేకం

వాల్మీకిపురం : వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథంలోని శ్రీ అభయాంజనేయస్వామి సమూహ దేవాలయంలో గురువారం పొలాల అమావాస్య సందర్భంగా లింగోద్భవ మహాశివుడికి అమావాస్య అన్నాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి జలాభిషేకం, క్షీరాభిషేకం, పసుపు, కుంకుమ, విభూతి, చందనం, సుగంధద్రవ్యాల అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అన్నాభిషేకం జరిపారు. భక్తులకు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



లింగోద్భవ మహాశివుడికి పూజలు చేస్తున్న అర్చకుడు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు

మున్సిపల్ షాపు రూముల వేలానికి స్పందన కరువు

మదనపల్లె : పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో మున్సిపాలిటీకి చెందిన షాపురూములకు గురువారం నిర్వహించిన వేలం పాటలకు స్పందన కరువైంది. వేలం పాటలకు సంబంధించి వారంరోజుల క్రితం మున్సిపల్ అధికారులు బహిరంగ వేలం ప్రకటన నోటీసు బోర్డులో ప్రకటించినప్పటికీ షాపురూములను అద్దె ప్రాతిపదికన తీసుకునేందుకు వ్యాపారులు ఆసక్తి కనపరచలేదు. మున్సిపాలిటీలోని జే.కే.వీధి, చిత్తూరు బస్టాండ్, బెంగళూరు బస్టాండు, ముగ్గురాళ్లవంకలో మొదటి అంతస్థులోని 40 షాపురూములు, ఆంధ్రకేసరి విపణికల్ప(పాత చంద్రవిలాస్ హోటల్)కు సంబంధించి బహిరంగ వేలానికి ప్రకటన ఇచ్చారు. వీటిలో ఆంధ్రకేసరి విపణికల్ప(హోటల్)కు ముగ్గురు, ముగ్గురాళ్లవంకలోని 44, 45 షాపురూములకు మాత్రమే దరఖాస్తుదారులు డిపాజిట్ చెల్లించి వేలంపాటలకు హాజరయ్యారు. తొలుత హోటల్‌కు నిర్వహించిన వేలంపాటల్లో రూ.1,60,000కు మున్సిపల్ అధికారులు ప్రభుత్వ ధరగా నిర్ణయించి.. ఎవరూ పాడుకునేందుకు ఆసక్తి కనపరచకపోవడంతో రూ.1,30,000కు తగ్గించారు. అయినప్పటికీ డిపాజిట్ చెల్లించిన వ్యక్తులు అద్దె అధికమని తగ్గించాల్సిందిగా కోరారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల మాట్లాడుతూ.. గతంలో 1,27,000 అద్దె ఉండేదని, అంతకంటే తగ్గించేందుకు ప్రభుత్వ నిబంధనలు అంగీకరించవన్నారు. దీంతో తాము వేలంపాటల నుంచి తప్పుకుంటున్నట్లు పాటదారులు ప్రకటించడంతో వేలం పాటలను రద్దుచేశారు. తదుపరి ముగ్గురాళ్ల వంకలోని షాపురూములు 44, 45కు నిర్వహించిన వేలంపాటల్లో నెలకు రూ.3,500 అద్దెకు షాపులను పాటదారులు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆర్వో నాగేశ్వరరావు, డీఈ బండపల్లిశిరీషా, మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయంలో షాపురూములకు వేలం పాట నిర్వహిస్తున్న కమిషనర్

ఓటర్లకు అనుకూలంగా పోలింగ్ కేంద్రాలు

గుర్రంకొండ : ఓటర్లకు అనుకూలంగా వారికి అవసరమైన అన్ని వసతులను పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ ఖాజాబీ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని శెట్టివారిపల్లె, అమిలేపల్లె, రామాపురం, నడిమికండ్రిగ, మర్రిపాడు గ్రామాల్లో పోలింగ్‌కేంద్రాల మార్పుపై చర్చించారు. జెడ్పీటీసీ సద్రీున్ ముక్తియార్, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, టీడీపీ నాయకులు ఎంఎల్‌ఎస్ మూర్తిస్వామి, చలపతి, కొండేటి ఆనంద్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజులు, జనసేన కన్వీనర్ బాలాజీ పాల్గొన్నారు.



రాజకీయ పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఖాజాబీ

పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు తెలపండి

పీలేరు : పీలేరు అసెంబ్లీ నియోజకవర్గం 163కు సంబంధించి పోలింగ్ కేంద్రాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె. గోపాలకృష్ణ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో 280 పోలింగ్ బూత్‌లు ఉన్నాయన్నారు. మండలంలో 72 బూత్‌లు ఉన్నట్లు తెలిపారు. 1500 ఓట్లకు మించిన పోలింగ్ కేంద్రాలను పునర్విభజన చేస్తామన్నారు.

తప్పులు లేని ఓటర్ల జాబితాకు సహకరించండి

కలకడ : తప్పులు లేని ఓటర్ల జాబితాకు అన్ని రాజకీయపార్టీల నేతలు సహకరించి పూర్తి సమాచారం అందించాలని తహసీల్దార్ ప్రదీప్ కోరారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయపార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎక్కడైనా పోలింగ్ బూత్‌ల వద్ద సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. ఎంపీపీ శ్రీదేవి, కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన ఉచిత వైద్యమే సీఎం లక్ష్యం

కలకడ : ప్రతి కుటుంబానికి మెరుగైన ఉచిత వైద్యం అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీపీ శ్రీదేవి, మెడికల్ ఆఫీసర్ మోహన్ అన్నారు. గురువారం మండలంలోని కె.బాటవారిపల్లె సచివాలయంలో ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లతో ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శి సాహిరాబాను పాల్గొన్నారు.

ఆ పొత్తు ప్యాకేజీ బంధమే

కురబలకోట : సీఎం జగన్ జనాన్ని నమ్ముకున్నాడు..అదే టీడీపీ, జనసేన ఒంటరిగా పోటీ చేసే దమ్ము లేక ఓటమి భయంతో పొత్తు ప్రకటించాయని జెడ్పీటీసీ బైసాని జ్యోతి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు బైసాని చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ బి. దస్తగిరి, సర్పంచ్ ఆర్కే కృష్ణారెడ్డి అన్నారు. గురువారం కురబలకోటలో గ్రామ సర్పంచ్ సుక్కా సుజాత మనోహర్ ఆధ్వర్యంలో పల్లెబాట నిర్వహించారు. ఈ సందర్భంగా వారు టీడీపీ, జన సేన పొత్తుపై మాట్లాడుతూ ప్యాకేజీ పొత్తులు కాలపరిమితి వరకే ఉంటాయన్నారు.

కొత్తపేట హరిజనవాడ ఆదర్శంగా నిలవాలి

మదనపల్లె : మండలంలోని సీటీఎం క్రాస్‌రోడ్ పంచాయతీలోని కొత్తపేట హరిజనవాడ మద్యరహిత ఆదర్శ గ్రామంగా నిలవాలని సర్పంచ్ బండపల్లి ఈశ్వరమ్మ, అక్కులప్ప అన్నారు. గురువారం తాలూకా సీఐ సత్యనారాయణ, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి గ్రామంలో మద్యం విక్రయాలపై సమావేశం ఏర్పాటు చేశారు. కొత్తపేట హరిజనవాడలో ఎవరూ మద్యం విక్రయించరాదని కట్టుబాటు చేశారు.

సమర్థవంతమైన విద్యతో వికాసం

కురబలకోట : సమర్థవంతమైన విద్య విద్యార్థుల్లో వికాసాన్ని కల్గిస్తుందని హైదరాబాదు జేఎన్‌టీయూ ఐటీ ప్రొఫెసర్ శ్రీనివాసులరెడ్డి అన్నారు. గురువారం అంగళ్లులోని విశ్వం ఇంజినీరింగ్ కళాశాలలో సమర్థవంతమైన విద్యపై కళాశాల చైర్మన్ ఎం.ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి. రమణారెడ్డి, హెచ్ఓడీ కళ్యాణి పాల్గొన్నారు.

ఆలయాల హుండీ ఆదాయం లెక్కింపు

మదనపల్లె సిటీ : దేవదాయశాఖ పరిధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి దేవస్థానం, సోమేశ్వరస్వామి దేవాలయం, యోగభోగేశ్వరస్వామి ఆలయాల హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఈఓ రమణ ఆధ్వర్యంలో మూడు నెలల ఆదాయం లెక్కించారు. శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో రూ.7,95,530, యోగభోగేశ్వరస్వామి ఆలయంలో 1,44,413, సోమేశ్వరస్వామి ఆలయంలో రూ.81,395 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బింగి పాండు తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

వాల్మీకిపురం : రైతుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీటీసీ నిర్మల అన్నారు. గురువారం మండలంలోని జర్రావారిపల్లె రైతు భరోసా కేంద్రంలో రాయితీపై ఉలవల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ మునిభాస్కర్, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాయితీ ఉలవలను సద్వినియోగం చేసుకోవాలి

కలకడ : ప్రభుత్వం అందించే రాయితీ ఉలవలను మండలంలోని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శ్రీదేవి కోరారు. గురువారం మండలంలోని కె.బాటవారిపల్లె రైతు భరోసా కేంద్రం పరిధిలో ప్రభుత్వం రాయితీపై మంజూరు చేసిన ఉలవలను రైతులకు అందజేశారు. వ్యవసాయశాఖ అధికారి లావణ్య, అగ్రికల్చర్ అసిస్టెంట్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి

తంబళ్లపల్లె/గుర్రంకొండ: వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని తంబళ్లపల్లె ఎస్ఐ లోకేష్‌రెడ్డి, గుర్రంకొండ ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. గ్రామాలలో వినాయక విగ్రహాలు పెట్టే నిర్వాహకులు స్థలం, విగ్రహ బరువు, ఎత్తు తదితర పూర్తి సమాచారంతో అనుమతి పొందాలన్నారు. లేకుంటే చర్యలు తప్పవన్నారు. విగ్రహాల వద్ద ఎలాంటి ఘర్షణలు లేకుండా నిర్వాహకులు జాగ్రత్త తీసుకోవాలన్నారు.